క్లుప్తంగా

నేత్ర దానం



అనంతస్వామి (ఫైల్)

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కొత్తూరుకు చెందిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు పరాంకుశం అనంతస్వామి శనివారం తన నివాసంలో హఠాన్మరణం పొందారు. తాను మృతిచెందాక తన నేత్రాలను దానం చేయాలని మాస్టారు బతికున్నప్పుడే కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆయన కోరిక మేరకు అనంతస్వామి మృతిచెందిన విషయాన్ని సదాశయ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ద్వారా ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో మృతుడి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంకుకు పంపించారు. మాస్టారు స్ఫూర్తిని గౌరవిస్తూ కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

నయీంనగర్: అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు సిక్స్ మెన్ కమిటీ చేస్తున్న కృషికి మద్దతు పలకాలని, అసత్య ప్రచారాలు పట్టించుకోవద్దని సిక్స్ మెన్ కమిటీ కోరింది. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సిక్స్ మెన్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. కమిటీ కన్వీనర్ బీఆర్.లెనిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోకన్వీనర్లు వేముల నాగరాజు, దయాసాగర్ సభ్యులు గడ్డం రాజిరెడ్డి, ఎం.సుధాకర్, బొల్లారపు సదయ్య పాల్గొని పలు నిర్ణయాలు తీసుకున్నారు. సభ్యుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 5ఏళ్ల కంటే తక్కువ అనుభవం ఉన్నవారి దరఖాస్తులను తిరస్కరించి తుది జాబితాను రూపొందించినట్లు వారు తెలిపారు. అనుభవం ఉన్న జర్నలిస్టుల విషయంలో మానవతా దృక్పథంతో కమిటీ వ్యవహరించిందని పేర్కొన్నారు. భూ సేకరణ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

బాధితులకు బియ్యం పంపిణీ



కరీమాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మల్లు స్వరాజ్యంనగర్(రాజీవ్ గృహకల్ప) బాధితులకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ పార్టీ పక్షాన 200కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు వివరించారు. పేదలకు ఏ సమస్య వచ్చినా పోరాడేందుకు సీపీఎం నిత్యం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గున్నాల ప్రభాకర్, సాజియా, ఉపేందర్, దివ్య, మధుకర్, మల్లయ్య, ఇస్మాయిల్, రతన్, యాకుబ్‌పాషా, శ్రీను, సరిత, జుబేదా, స్వరూప, జహీదా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మడికొండ: యువకులు ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. కాజీపేట మండలం మడికొండ వ్యాసపురి కాలనీలోని శ్రీవేదవ్యాస పబ్లిక్ స్కూల్‌లో సేవా భారతి, గోద్రెజ్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్, మైక్రో ఓవెన్, ఇతర గృహోపకరణల మరమ్మతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానుందని ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 90599 07740 నంబర్‌లో సంప్రదించాలని సేవా భారతి జిల్లా కార్యదర్శి ఎం.హనుమారెడ్డి, ఆవాస ప్రధాన కార్యదర్శి సుద్దాల వెంకటనారాయణ, మహేష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

పెరికవాడలో నిఘా పెంచాలి

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరికవాడలో రాత్రి, పగలు పోలీసుల నిఘా పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల పెరికవాడలోని దేవాలయంలో హుండీని గుర్తు తెలియని ధ్వంసం చేసి వ్యక్తులు చోరీ చేశారు. ఆ ఘటన మరక ముందే శుక్రవారం అర్ధరాత్రి పెరకవాడ వీధుల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించారని స్థానికులు తెలిపారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మడికొండ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చువాలని మాస్టర్జీ పాఠశాల కోఆర్డినేటర్ భరత్‌కుమార్ సూచించారు. మడికొండలోని మాస్టర్జీ పాఠశాలలో స్కూల్ లీడర్స్, గ్రూప్ లీడర్స్ ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి భరత్‌కుమార్ శనివారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షీలో, ఏఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం





జిల్లా గ్రంథాలయంలో రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న ప్రముఖులు | ప్రభుత్వ కళాశాలలో..

హన్మకొండ చౌరస్తా: గ్రంథాలయాల పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ 131వ జయంతి సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ గ్రంథ పాలకుడిగా ఎంపికైన పరకాలకు చెందిన విశ్వనాథానికి హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద గల జిల్లా గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందించి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా సెక్రటరీ శోజాదేవి, సంస్థ డైరెక్టర్ సముద్రాల మధు, డిప్యూటీ లైబ్రేరియన్ కరుణకుమారి, గ్రంథ పాలకులు మల్సూర్, పురుషోత్తం రాజు, సిబ్బంది నిఖిల్, సంతోష్‌కుమార్, మమత, సత్యప్రకాష్, రాజేంద్రప్రసాద్, కొండయ్య, సుధాకర్, రాజేష్, కావ్య, ప్రసన్న, అబ్జల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో లైబ్రేరియన్స్ డే

విద్యారణ్యపురి: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 131వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, లైబ్రేరియన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మేంద్ర మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా గ్రంథాలయాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. రంగనాథన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో రిటైర్డ్ అయిన రాజన్‌బాబును, ఇటీవల గ్రంథాలయ శాస్త్రంలో డాక్టరేట్ పొందిన కేడీసీ లైబ్రేరియన్ పల్లెర్ల శంకరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ రాజేశ్వర్‌కుమార్, సీనియర్ లైబ్రేరియన్ అశోక్‌కుమార్, పలు కళాశాలలకు చెందిన గ్రంథపాలకులు హేలునాయక్, సారంగపాణి, గీత, వనమాల, రాజశేఖర్, జగదీష్, ఆసిఫ్, కళాశాల అధ్యాపకులు అబ్దుల్ గని, రాజ్‌కుమార్, అరుణ్, నవీన్, సంతోష్, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ డివిజన్‌లోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నంబర్లు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్య తలెత్తితే ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సబ్ స్టేషన్ల వారీగా ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ వివరాలు

సబ్ స్టేషన్	సబ్ స్టేషన్ ఫోన్ నంబర్	ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నంబర్	ఏఈ ఫోన్ నంబర్
గోపాల్‌పూర్	9491074615	9491074615	9491058646
నక్కలగుట్ట	9491075006	9491074613	9440811346
కేయూసీ	08702461618	9491075001	9440811344
నిట్	9491075003	9491075003	9440811345
కలెక్టరేట్	7901097133	8331011383	9440811347
న్యూ శాయంపేట	9491075004	8331011383	9440811347
సోమిడి	9492461820	9492461820	8333923912
వెస్ట్‌సిటీ	9491075005	9492461820	8333923912
వడ్డేపల్లి	7901097132	9492461801	8333923916
మడికొండ	9491075044	9491075044	9440811354
రాంపూర్	9492461606	9491075044	9440811354
టెక్స్‌టైల్ పార్కు	9440233768	9491075044	9440811354
టేకులగూడెం	8985185515	9491075044	9440811354
బాలసముద్రం	08702461615	9491075002	9440811343
మచిలీబజార్	08702461605	9491075002	9440811343
యాదవనగర్	8332989175	9492461893	8333923913
పెద్దమ్మగడ్డ	9492461893	9492461893	8333923913
కడిపికొండ	--------	------	7901624851

గ్రూప్ -2 పరీక్షలు వాయిదా వేయాలి



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కేయూలో నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: గ్రూప్ -2 పరీక్షలను వాయిదా వేయాలని బహుజన సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు బీఎస్పీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో శనివారం రాస్తారోకో చేసి అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రూప్ -2 పరీక్షలు వాయిదా వేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్షకు పూనుకోగా, అతన్ని గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్రూప్ -2లో 73శాతం వరకు సిలబస్ మారిందని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ మహిళా కన్వీనర్ అడ్లూరి పద్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజుల మణి, నాయకులు పసుల వినయ్ అంబేడ్కర్, అమ్మ సాంబయ్య, ఎండీ.మినాజ్, బొట్ల నితిన్, లత, రజిత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలోని లైబ్రరీ ఆవరణలో..

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు -2 పరీక్షలను నాలుగు నెలలపాటు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రూపు -2 అభ్యర్థులతో కలిసి కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెలంతా పోటీ పరీక్షలు ఉన్నందున గ్రూపు -2 పరీక్షల కోసం సన్నద్ధం అయ్యేందుకు అభ్యర్థులకు సమయం కావాలని కోరారు. కార్యక్రమంలో రాజకుమార్, సందీప్, గణేష్, సునీల్‌కుమార్, సాయి, వినయ్‌రాజ్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

హన్మకొండ కల్చరల్: హనుమాన్ దీక్షపరులు, భక్తులు వచ్చే ఏడాది జనవరి 1న తిరుపతిలో కోటి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్న సందర్భంగా జిల్లాల వారీగా రథాల ఊరేగింపు కార్యక్రమంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. హనుమద్గిరి శ్రీపసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనగామ, పరకాల, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు పాల్గొని రథాల ఊరేగింపుపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో గంద కృష్ణ, కనుకుంట్ల రవికుమార్, కర్రు దశరథ్‌కుమార్, మాదాసు మొగులయ్య, ఉపేంద్రస్వామి, ఎల్లయ్య, సత్యనారాయణ, బాల రమేష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వాహనదారుల సందడి



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ స్టేషన్‌లో శనివారం వాహనదారుల సందడి కనిపించింది. వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్ తరలించారు. దాంతో పట్టుబడిన వాహనాలను తీసుకెళ్లేందుకు వాహనచోదకులు స్టేషన్‌కు చేరుకున్నారు. సరైన ఆధారాలతో కూడిన ధ్రువ పత్రాలు అందజేసిన వాహనచోదకులకు తిరిగి వాహనాలను అప్పగించినట్లు తెలిసింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: భార్యభర్తల మధ్య గొడవల కారణంగా రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందాడు. రైల్వే ఆర్పీఎఫ్ అధికారుల కథనం ప్రకారం.. వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతానికి చెందిన ఓదెల సతీష్‌కుమార్ - రంజిత దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండగా, తన ఇద్దరు పిల్లలను తీసుకుని రజిత పదినెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. దాంతో మనోవేదనకు గురైన సతీష్‌కుమార్.. శుక్రవారం రాత్రి సంతోషిమాత గుడి సమీపంలోని ట్రాక్‌పై కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు.. ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. సతీష్‌కుమార్ మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతుడి తండ్రి ఓదెల వీరయ్యకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఈద్గా వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఆటో బోల్తా కొట్టింది. దాంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అర్హులకు ప్లాట్ల కేటాయింపునకు కృషి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని అర్హులైన వ్యాపారులకు ప్లాట్లు వచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌ను లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు చెందిన తెలంగాణ పొదుపు మార్కెటింగ్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యేను కలిసిన వడుప్సా నాయకులు

వరంగల్: వరంగల్ నగరంలోని ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను వరంగల్ జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (వడుప్సా) రాష్ట్ర అడ్వైజర్ భూపాల్‌రావు, నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు నాగార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో వడుప్సా సభ్యులు కలిశారు.

బీసీల్లోని అన్ని కులాలకు రుణాలివ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కాశిబుగ్గ: వెనుకబడిన తరగతుల్లోని అన్ని కులాలకు చెందిన వారికి బీసీ బంధు పథకం వర్తింపజేస్తూ రూ.10 లక్షలు రుణంగా అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీసీలకు మరింత అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బంధు పథకం దళితుల్లోని అన్ని కులాలకు వర్తింపజేసినప్పుడు బీసీలో అన్ని కులాలకు ఎందుకు వర్తింప చేయడం లేదని, బీసీలో 133 కులాలు ఉంటే కేవలం 13 కులాలకు బీసీ బంధు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రత్నం సతీష్‌షా, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, పొట్టి శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్, కోట సతీష్, ఎస్సీ రఘునారెడ్డి, రంజిత్, రత్నం కృష్ణ కిశోర్, మార్టిన్ లూథర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి



జెండా ఆవిష్కరిస్తున్న తక్కెళ్లపెల్లి శ్రీనివాస్‌రావు

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై పోరాడాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కెళ్లపెల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండలోని ప్రభుత్వ ఎస్టీ స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ దేశవ్యాపితంగా విద్యారంగ సమస్యలపై అంకితభావంతో నాటినుంచి నేటివరకు ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు భాను పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

కరీమాబాద్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వరంగల్ రంగశాయిపేట జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సాగర్, శివకుమార్, సంతోష్, రాజు, రోజా, హసీన్, నేవెల్, శివమణి, కీర్తన పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిన ఉద్యోగులు



వాహనాలను ప్రారంభిస్తున్న జగన్మోహన్ రావు

హన్మకొండ: పాత పెన్షన్ సంకల్ప సాధన సభలో పాల్గొనేందుకు ఉద్యోగులు హైదరాబాద్ తరలివెళ్లారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ వద్ద ఉద్యోగులు వెళ్తున్న వాహనాలను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్ రావు, రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. 50 బస్సుల్లో 3వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవన్‌కుమార్, కొండా శ్రీనివాస్, షేక్ అఫ్జల్, వీరేశం, డాక్టర్ వెంకటస్వామి, రాజు పాడ్యా, కుమారస్వామి, చేతన్ పాల్గొన్నారు.

పొదుపు సంఘం మహిళల ధర్నా



ధర్నా చేస్తున్న పొదుపు సంఘం మహిళలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం తరాలపల్లి గ్రామంలోని ఆదర్శ మహిళా పొదుపు సంఘం మహిళలు గ్రామంలోని రోడ్డుపై శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పొదుపు సంఘం నాయకులు మాట్లాడుతూ ఆదర్శ పొదుపు సంఘంలో 18 ఏళ్లపాటు అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శారదను వనమాల కనపర్తిలోని పొదుపు సంఘం అకౌంటెంట్‌గా మూడు నెలల క్రితం సీడీఎఫ్ అధికారులు బదిలీ చేశారు. శారద స్థానంలో మరొకరిని సమితి ఆధ్వర్యంలో ఎంచుకున్నారు. శారద మరలా తరాలపల్లిలోని పొదుపు సంఘంలో విధులు నిర్వహించేందుకు వస్తుండగా అడ్డుకుని ధర్నాకు దిగినట్లు తెలిపారు. ఈమేరకు శారదపై సీడీఎఫ్ అధికారి రాజశ్రీ చర్యలు తీసుకుని 750మంది సభ్యులు గల పొదుపు సంఘాన్ని కాపాడాలని పొదుపు సంఘం మహిళలు కోరారు.

పెరుగుతున్న కళ్ల కలక కేసులు

కాజీపేట: కండ్ల కలక.. ఈ పేరు వింటేనే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కండ్ల కలక బాధితులే దర్శనమిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ఆస్పత్రులకు బాధితులు తరలివచ్చి చికిత్స పొందుతున్నారు. గతంలో ఎప్పుడో ఒకసారి వచ్చే ఈ వ్యాధిగ్రస్తులు.. ఇటీవల రోజుకు 5నుంచి 10 మంది వరకు రావడం గమనార్హం. ఆగస్టు 1నుంచి 12వ తేదీ వరకు సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో 48 మంది వైద్యం పొందారు. నిత్యం ఎంత మంది వచ్చినా సేవలు అందించడానికి సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ టీ.మధులత తెలిపారు. కళ్ల కలక సోకిన వారు బయపడాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవాలన్నారు.

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం



108 సర్వీస్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ విప్

కాజీపేట: పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 108 సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం నడిపిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నూతన 108 సర్వీస్‌ను కాజీపేట చౌరస్తాలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 108 సర్వీస్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచడాన్ని సిబ్బంది హర్షిస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, ఈఎంఈ రాము, చంద్రశేఖర్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌ను కలిసిన రేషన్ డీలర్లు

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్ ఆధ్వర్యంలో పలువురు రేషన్ డీలర్లు కలిశారు. రేషన్ డీలర్ల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపిన సందర్భంగా బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వినయ్‌భాస్కర్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరస్వామి, కృష్ణవేణి, గౌరీశంకర్, పోతరాజు రమేష్, బత్తుల మహేష్, ఏదులపురం వెంకటేశ్వర్లు, కొలిపాక రాజసాంబయ్య, వెనుకంటి విజయపాల్, రాచమల్ల రాజు, మేకల తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్య సమాజ్ ప్రతినిధులు

హసన్‌పర్తి: అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ నూతన భవన నిర్మాణానికి రూ.5 లక్షలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా అందుకు సంబంధించిన ఉత్తర్వుల ప్రతులను నిర్వాహకులకు హనుమకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే శనివారం అందజేశారు. కార్యక్రమంలో 56వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆర్య సమాజ్ ప్రతినిధులు పీ.రవీందర్, శీలం వెంకటస్వామి, హసన్‌పర్తి మండల వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విజయ్ పాల్గొన్నారు.

కొత్తవారికి కూడా తగిన గుర్తింపు

కొత్తగా పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్ తెట్టె గణేష్ శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గణేష్‌ను పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, మన బడి - మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమకుమార్, నాయకులు భాస్కర్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఎరుకల జాతిని గుర్తించిన కేసీఆర్



సమావేశంలో మహిళా సంఘం సభ్యులు

కాశిబుగ్గ: రాష్ట్రంలోని కాంగ్రెస్, టీడీపీలు ఎరుకల జాతిని గుర్తించలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ గుర్తించి గవర్నర్ కోటా కింద సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు అన్నారు. 19వ డివిజన్‌లో ఏకలవ్య మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మానుపాటి సబిత, ప్రధాన కార్యదర్శి ఓని రజిత, సహాయ కార్యదర్శి మాదిగాని సరోజన, కోశాధికారి కల్పన, సహాయ కోశాధికారి స్రవంతి ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవం శనివారం జరిగింది. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు పల్లకొండ యాదగిరి, పల్లకొండ ప్రభాకర్, పులిచేరి సూరయ్య, కుమారస్వామి, ఓని సదానందం, పల్లకొండ భిక్షపతి, సాంబశివ, సమ్మయ్య పాల్గొన్నారు.

'యుద్ధభేరి'ని విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

వరంగల్: సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పద్మశాలీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, అందులో భాగంగా జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆదివారం నిర్వహించనున్న 'పద్మశాలి రాజకీయ యుద్ధభేరి'ని విజయవంతం చేయాలని వరంగల్ తూర్పు బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలీలకు గుర్తింపునిచ్చి రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. చేనేత రంగం అభివృద్ధికి అనేక ప్రోత్సాహకాలు అందజేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు ముంజ్రాతి వెంకన్న, మల్లికార్జున్, చంద్రమౌళి, అపురూప రజినీష్ నేత, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)